క్లుప్తంగా

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న కళాశాల సిబ్బంది

కురబలకోట: అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, మిట్స్ కళాశాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. మదనపల్లె అమ్మచెరువు మిట్ట వద్ద నున్న వెలుగు స్కూల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 281మంది వృద్ధులు, దివ్యాంగులు, బధిరులకు దుస్తులు పంపిణీ చేసినట్లు ప్రిన్సిపల్ యువరాజ్ తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకుల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

ఆధార్ కేంద్రాల తనిఖీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను మండల తహసీల్దారు శ్రీరాములు నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రైవేటు వ్యక్తులు బలవంతంగా అఫిడవిట్ అంటగడుతూ అధిక సొమ్ము వసూలు చేస్తున్నారనే విషయంపై సాక్షి పత్రికలో వచ్చిన ఆధార్ కేంద్రాల్లో నిలువు దోపిడీ వార్తకు అధికారులు స్పందించారు. తహసీల్దారుతోపాటు ఆర్ఐ బాలాజీ ఆధార్ కేంద్రాలకు వెళ్లి నిర్దేశిత సొమ్ము వివరాలను సచివాలయం గోడలపై డిస్‌ప్లే చేయాలని ఆదేశించారు. అవసరం లేకున్నా అఫిడవిట్లు ఇస్తున్న ప్రైవేటు దుకాణాదారులను హెచ్చరించినట్లు తహసీల్దారు పేర్కొన్నారు.

ఇంటి పన్ను వివరాలు ఆన్‌లైన్ చేసుకోండి

పీలేరు: స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా గూడరేవుపల్లె పంచాయతీ పరిధిలో ఇంటి పన్ను ఆన్‌లైన్ చేసుకోవాలని సెక్రటరీ సిగ్బతుల్లా తెలిపారు. పీలేరు పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉన్న హౌసింగ్ కాలనీ, కంకర్ ఫ్యాక్టరీ లేఅవుట్ హౌసింగ్ కాలనీ లబ్ధిదారుల తోపాటు, సొంత స్థలాల్లో ఇల్లు నిర్మించుకున్న వారు ఇంటి పన్ను ఆన్‌లైన్ చేసుకోవాలని కోరారు. ఆధార్‌కార్డు, ఇంటి పట్టాతో సచివాలయంలో సంప్రదించాలని కోరారు.

వంద శాతం పూర్తిచేయాలి



సమావేశంలో సూచనలిస్తున్న ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి

తంబళ్లపల్లె : విద్యార్థుల అపార్ అప్‌డేట్ ప్రక్రియ వందశాతం పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిటిటల్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సకాలంలో బర్త్ సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ దిలిప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న అమృతతేజ

పీలేరు రూరల్ : అపార్ ఐడీ జనరేట్ చేసుకుంటున్న విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ అన్నారు. ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ ఐడీ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సాయిసంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

రాయచోటి అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రభుత్వం చెల్లించవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంకం శివారెడ్డి, పోకల మధుసూదన్‌లు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్జీఓ సభా భవనంలో రీజనల్ కన్వీనర్ కె.వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన రాయచోటి రీజియన్ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమ భారాన్ని తగ్గించాలన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని రాష్ట్రంలో అమలులోకి తీసుకురావాలంటూ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామంటూ వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ కన్వీనర్ రవీంద్రనాథరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ మురళికుమార్, మున్వర్‌బాషా, నరసింహులు, సదాశివరెడ్డి, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, గోపిక్రిష్ణ, శేఖర్‌రెడ్డి, రామాంజులు, ప్రదీప్, మన్సూర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల రహిత రాష్ట్రాన్ని నిర్మిద్దాం



పీలేరు : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, తదితరులు

పీలేరురూరల్ : బాల్య వివాహాల రహిత రాష్ట్రాన్ని నిర్మించడం ప్రతి ఒక్కరి బాధ్యత అరి తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. స్థానిక గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం బాల్య వివాహ ముక్త్ భారత్ దినోత్సవం నిర్వహించారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలు డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ వివరించారు. బాల్య వివాహ నిషేధ చట్టాన్ని సమర్థంగా అమలుచేద్దామని బాలికలచే ప్రతిజ్ఞ చేయిచారు. అనంతరం బాల్య వివాహాలు వద్దు... చదువేమాకు ముద్దు అంటూ నినాదాలతో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, ఏఎన్ఎం భార్గవి, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ : బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని ఫోర్డు డైరెక్టర్ జిల్లా లలితమ్మ పేర్కొన్నారు. స్థానిక ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బుధవారం బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. లలితమ్మ మాట్లాడుతూ బాల్యవివాహాలపై తల్లిదండ్రుల్లో అవగాహన రావాలని తెలిపారు. ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ బాలికలు బడికి రాని పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. డ్రాపౌట్స్ తర్వాత బాల్య వివాహాలు జరిగే అవకాశం ఎక్కువ ఉందన్నారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఇస్మాయిల్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలలో ఎక్కువగా బాల్యవివాహాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, ఫోర్డు సిబ్బంది అల్తాఫ్, స్వర్ణకుమారి, నరసింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహరహిత ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా బాల్య వివాహ వ్యతిరేక ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం పుణ్యవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేశారు.

గుర్రంకొండ : సమాజంలో బాల్య వివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ మధు రామచంద్రుడు అన్నారు. స్థానిక ఏపీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు బాల్య వివాహాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలచే బాల్య వివాహాలను వ్యతిరేకిస్తామని ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు జరుగుతాయని, బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శిరీష, ఏఎస్ఐ మోసెస్, ఎస్బీ కానిస్టేబుల్ విజయ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామసముద్రం : బాల్య వివాహాలతో అనేక నష్టాలు కలుగుతాయని ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులచే స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వరకు బాల్య వివాహాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహం చేయడంతో కలిగే అనర్థాలపై సలహాలు, సూచనలు అందజేశారు. బాలికలపై జరుగుతున్న అరాచకాలను ప్రతి ఒక్కరూ అరికట్లాన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, ఎంఈఓ హేమలత, ప్రిన్సిపల్ చిట్టిబాబు, ఏపీఎం సాంబ, సూపర్‌వైజర్ చంద్రకాంతమ్మ, ఉపాధ్యాయులు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత మండలంగా తీర్చిదిద్దాలి

తంబళ్లపల్లె : సమష్టి కృషితో మండలాన్ని బాల్య వివాహ రహిత మండలంగా తీర్చిదిద్దాలని ఏపీఎం గంగాధర్ కోరారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో బాల్య వివాహ ముక్తి భారత్ దినోత్సవం సందర్భంగా మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. గంగాధర్ మాట్లాడుతూ బాల్య వివాహాలతో బాలికల విద్య, ఆరోగ్యం, రక్షణ, అభివృద్ధికి ఆటంకాలు కలుగుతాయన్నారు. వారి జీవితాలు ఛిద్రమవుతాయన్నారు. అనంతరం బాల్యవాహాలు నివారిస్తామని మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ నజీర్‌బాషా, సీసీలు, సంఘమిత్రలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మదనపల్లె సిటీ : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



గుర్రంకొండ : విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ



రామసముద్రం : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



తంబళ్లపల్లె : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

వైభవంగా బ్రాహ్మణ కార్తిక వనమహోత్సవం



సామూహిక భోజనాలు చేస్తున్న బ్రాహ్మణులు, సంఘం ప్రతినిధులు

రామసముద్రం: మండలంలోని బరిడేపల్లె గ్రామం సమీపంలో తిరుమల దేవరగుడి ఆలయం వద్ద బుధవారం బ్రాహ్మణ కార్తిక వన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముందుగా బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కామకోటి ప్రసాదరావు, నాగభూషణరావు, కార్పొరేషన్ సిబ్బంది ప్రసాద్, సుబ్రహ్మణ్యం ఉసిరి చెట్టు నాటి పూజలు జరిపారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి సామూహిక వన భోజనాలు చేశారు. అనంతరం జరిగిన ఆటలు, పాటల పోటీలు ఆకట్టుకున్నాయి. సంఘ ప్రతినిధులు మహీధరరావు, కులశేఖర్ భట్టార్ మాట్లాడుతూ ఏటా వన భోజన ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అప్పిస్వామి, సీతారామయ్య, రాజేంద్ర, నారాయణ, రాజేష్, అశోక్, శ్రీనివాసరావు, సరసమ్మ, సుజాత, రాజేష్, మహి, వేణుగోపాల్‌రావు, నారాయణరావు, పుంగనూరు, రామసముద్రం నుంచి బ్రాహ్మణులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

29న మదనపల్లె ఆర్టీసీ బస్సు టికెట్ లక్కీ డ్రా



మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ: మదనపల్లె-తంబళ్లపల్లె రూట్ నందు ఈ నెల 29వ తేదీన లక్కీడ్రా తీయనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. బస్సులో ప్రయాణించే ప్రయాణికులు టిక్కెట్లు వెనుక వారి పేరు, మొబైల్ నంబర్ రాసి గిఫ్టుబాక్సులో వేయాలన్నారు. లక్కీ డ్రాలో వచ్చిన ముగ్గురికి బహుమతులు అందజేస్తామన్నారు.

సమయ పాలన పాటించాలి:

ఆర్టీసీ సిబ్బంది సమయపాలన పాటించాలని ఆర్టీసీ-1 డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. స్థానిక డిపో కార్యాలయంలో సమయపాలన మాసోత్సవాలను పురస్కరించుకుని జరిగిన సమావేశంలో అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు, అత్యధిక కెఎంపిఎల్ తెచ్చిన డ్రైవర్లను ఆయన అభినందించారు. ఈపీకె 45, ఓఆర్ 80, కెఎంపిఎల్ 5.50 తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తాం

ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

పీలేరు: పీలేరు నియోజకవర్గంలో అర్హులకు త్వరలో మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి 1.5 సెంట్ల చొప్పున స్థలం ఇవ్వడంతో ఇల్లు కట్టుకోవడానికి సరిపోలేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీకి కట్టుబడి అర్హులైన నిరుపేదలకు మూడు సెంట్ల స్థలాలు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తిరుపతి రోడ్డు మార్గం, డిగ్రీ కళాశాల సమీపంలోని ఉన్నత స్థలాలను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, కోటపల్లె బాబురెడ్డి, అమరనాథరెడ్డి, రామ్మూర్తి, రెడ్డిబాషా, శ్రీనాథరెడ్డి, సతీష్‌రెడ్డి, చాపలసూరి, కంచిసూరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందడం లేదు

శ్రీకాంత్‌రెడ్డికి గుంటిమడుగు వాసుల వినతి



గుంటిమడుగు హరిజన వాడ ప్రజలతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు మాకు అందడం లేదని గుంటిమడుగు హరిజనవాడ దళిత ప్రజలు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి ఎదుట వాపోయారు. గుంటిమడుగు హరిజనవాడలో మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, మండల బీసీ నాయకులు పల్లపు రమేష్‌లతో కలసి ప్రజలతో మమేకమయ్యారు. ప్రజలు మాట్లాడుతూ ఈ ఏడాది వానలు సక్రమంగా కురవకపోవడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దీంతో వ్యవసాయ కూలీ పనులు తగ్గాయని చెప్పారు. వ్యవసాయంలో పెట్టుబడి నిధి కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు అమలు చేయకపోవడంతోతీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. పాల రేట్లు రూ.10లు మేర తగ్గాయన్నా ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు రూ.18 వేలు ఇస్తామని హామీని పట్టించుకోవడం లేదన్నారు. అలానే తల్లికి వందనం, జాబ్ క్యాలెండర్‌ల ఊసేలేదన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఏ పథకం రాకపోవడంతో చేతి ఖర్చులకు డబ్బులు లేక అల్లాడుతున్నామని తమ బాధను శ్రీకాంత్‌రెడ్డికి వెలిబుచ్చుకున్నారు. గత ప్రభుత్వంలో ఠంచన్‌గా పథకాలు అందేవని ఇప్పుడు ఏ పథకం అందకపోతుండటంతో ఆర్థిక భారం కుటుంబపోషణపై పడుతోందంటూ వాపోయారు.

కార్యకర్తలకు ఎల్లవేళలా తోడుంటా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు ఎల్లవేళలా తాను తోడుంటానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి భరోసా కల్పించారు. గ్రామ స్థాయి నాయకులతో కలిసి ప్రభుత్వ హామీల మలు, లబ్ధిదారుల ఎంపిక, తదితర అంశాలపై చర్చించారు. అందరం సమష్టిగా పనిచేస్తూ వైఎస్సార్ సీపీని బలోపేతం చేసుకుందామని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, మాజీ సర్పంచ్ ఖాదర్ వలీ, శేఖర్ రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, బాబు, కౌన్సిలర్ కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్ర, సుబ్బారెడ్డి, జుల్ఫికర్, దర్బార్, జల్లార్, ఆంజనేయులు, ఖాదర్ బాషా, మాజీ డీలర్ రమణ, మనోహర్, రాజా, వీరాంజనేయులు, వెంకటరమణ, బర్నీ తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడనంపై అప్రమత్తంగా ఉండండి

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



మదనపల్లె : మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులకు ముందస్తు ఏర్పాట్లపై ఆయన చర్చించారు. లోతట్టుప్రాంతాలు, పొంగి పొర్లే రోడ్లు, ఇతర ప్రదేశాల్లో ముందస్తు చర్యలు తీసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. రైతులను నిరంతరం అప్రమత్తం చేయాలని, నీటి ట్యాంకుల నుంచి నమూనాలు సేకరించి పరీక్షకు పంపాలన్నారు. నదులు, వంకలు, పరివాహక ప్రాంతాలు, లోతట్టుప్రాంతాల్లోని అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు పంటలు, ధాన్యం, పశు సంపద కాపాడుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. వైద్య సేవలకు అంతరాయం కలగకుండా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే, కంట్రోల్‌రూమ్‌లకు ఫోన్‌చేయాలన్నారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామని, ఎక్కడైనా సహాయకచర్యలు అవసరమైతే 08571-231181 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్



భూసార పరీక్షలతో లాభాలపై రైతులకు వివరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

మదనపల్లె : భూసార పరీక్షలతో రైతులు నేల ఆరోగ్యం, పోషకాల లభ్యత తెలుసుకుని స్థూల, సూక్ష్మ పోషకాలను పంటలకు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ తెలిపారు. మండలంలోని తిప్పిరెడ్డిగారిపల్లెలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన రైతులకు భూసారపరీక్ష కార్డులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి అన్నారు. వాస్తవానికి 90 శాతం రైతులు పంటకు కావాల్సిన పోషక విలువలు తమ భూమిలో ఉన్నాయో లేదో తెలుసుకోకుండానే పంట సాగు చేస్తున్నారన్నారు. దిగుబడుల కోసం రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారన్నారు. ఫలితంగా ఖర్చులు తప్ప దిగుబడులు పెరగడం లేదన్నారు. ఎరువుల వల్ల భూమిలో సహజ సిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయని తెలిపారు. రబీకి సంబంధించి డిసెంబర్ 15లోపు టమాటా, వరి, వేరుశెనగ పంటలకు పంటల బీమా చేసుకోవాలన్నారు. పంటల బీమాకు సంబంధించి రైతులే స్వచ్ఛందంగా సీఎస్‌సీలలో రైతు వాటా ప్రీమియం చెల్లించి నమోదుచేసుకోవాలన్నారు. రబీ-ఈక్రాప్ త్వరలోనే చేస్తామన్నారు. కార్యక్రమంలో మదనపల్లె ఏడీ శివశంకర్, ఏఓ నాగప్రసాద్, హెచ్ఓ ఈశ్వర్‌రెడ్డి, టెక్నికల్ ఏఓ రమేష్‌రాజు, వీఏఏ తేజ, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గుర్రంకొండ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో వెంకటేశులు మాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్ద రాజ్యాంగం దేశంలో ఉండడం అందరికీ గర్వకారణమన్నారు. రాజ్యాంగాన్ని ప్రతి ఒక్క పౌరుడు గౌరవించి ఆచరించాలన్నారు. ఎంపీడీవో వెంకటేశులు, ఎవో నాగశివారెడ్డి, ఎంఈవోలు సురేంద్రబాబు, సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

30న చలిమామిడిపల్లెలో సివిల్ రైట్స్ డే

నిమ్మనపల్లె : మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ చలిమామిడిపల్లెలో ఈ నెల 30న సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ధనంజయులు తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు రావాలన్నారు. మండల విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు సివిల్ రైట్స్‌డేకు హాజరుకావాలని కోరారు.

బేస్ క్యాంపుల పరిశీలన



అటవీ సిబ్బంది సమావేశంలో డీఎఫ్ఓ రాజశేఖర్‌బాబు

పోరుమామిళ్ల : డీఎఫ్ఓ రాజశేఖర్‌బాబు మంగళ, బుధవారాల్లో పోరుమామిళ్ల రేంజ్‌లో ఎర్రచందనం చెట్లు, బేస్ క్యాంపులు, టైగర్ కారిడార్, ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఎర్రచందనం పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి సూచించారు. పెద్దబావి బీట్‌లో మంగళవారం రాత్రి బస చేశారు. బుధవారం పోరుమామిళ్ల అటవీ కార్యాలయంలో రేంజ్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మదన్‌మోహన్‌రెడ్డి, రఘునాథరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



లిఖిత మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం) : మండల కేంద్రంలోని కోనేటి వీధికి చెందిన అప్పల్ల ఆచారి కోడలు, కానిస్టేబుల్ చైతన్య లిఖిత(28) మంగళవారం రాత్రి గుండెపోటుకు గురై హఠాన్మరణం చెందారు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం కోనేటి వీధికి చేరుకుని లిఖిత మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీళ్ల భాస్కర్, వాల్మీకిపురం ఉపసర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, తదితరులు ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

29న శివుడికి రుద్రాభిషేకం

పెద్దతిప్పసముద్రం : పెద్దతిప్పసముద్రం శివాలయంలో ఈ నెల 29న మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు సనగరం పట్టాభిరామయ్య, ఆకుల మల్లికార్జున తెలిపారు. రాత్రి భాగవతారిణి స్వర్ణలత బృందంచే హరికథా కాలక్షేపం ఉంటుందని వారు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్.వెంకటరమణ

మదనపల్లె : పట్టణంలోని సత్సంగ్ ఫౌండేషన్, స్వాస్థ ఆస్పత్రి సంయుక్తంగా బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించాయి. బెంగళూరుకు చెందిన బ్రెయిన్స్ హాస్పిటల్ న్యూరో సర్జన్ డాక్టర్.వెంకటరమణ ప్రజలను పరీక్షించి వైద్య సలహాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మదనపల్లె పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేశామన్నారు. స్వాస్థ ఆస్పత్రిలో ఓపీ కార్డుకు డబ్బు చెల్లించనవసరం లేదని, హాస్పిటల్‌లో బెడ్ చార్జీలు ఉచితమే అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్‌రెడ్డి, కృష్ణతేజ, నర్సింగ్ సూపరింటెండెంట్ అరుణ, ఫీల్డ్ ఆఫీసర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.